క్లుప్తంగా

28న జాబ్‌మేళా

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 28న నిరుద్యోగుల కోసం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు బుధవారం జిల్లా ఉపాధి అధికారి గానేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఐసీఐసీఐ బ్యాంక్‌పై ఉన్న సీఆర్ఎస్ అడ్వాన్స్ కంప్యూటర్ ఎడ్యుకేషన్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు మేళా మొదలవుతుందన్నారు. కనీస విద్యార్హత పదో తరగతి అని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో సేల్స్ రిప్రజెంటేటివ్, గ్రూప్ లీడర్, టీం రిప్రజెంటెటివ్ పోస్టుల్లో మొత్తం 50 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. నిజామాబాద్ శ్రీవిద్య ఫర్టిలైజర్‌లో ఉద్యోగాలు ఉన్నట్లు తెలిపారు.

'మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి'



ర్యాలీ తీస్తున్న నాయకులు

కడెం: మణిపూర్ రాష్ట్రంలో శాంతి నెలకొల్పాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు భూక్య రమేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ విద్వేషాలతోనే ఇరువర్గాల మధ్య అల్లర్లు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో కోటయ్య, శ్రీనివాస్, భూదయ్య తదితరులు ఉన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేత

భైంసాటౌన్: గతంలో పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించినందుకు బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు గాలి రవిపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు తెలిపారు. ఈ మేరకు బుధవారం పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో పార్టీ సిద్ధాంతం కోసం పనిచేయాలన్నారు. జిల్లా సహ ఇన్‌చార్జి మ్యా న మహేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసె మ్మెరాజు, అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, పట్టణాధ్యక్షులు మల్లేశ్వర్ ఉన్నారు.

ఊడిన పెచ్చులు..తప్పిన ముప్పు



వర్షానికి పెచ్చులూడటంతో దెబ్బతిన్న ఇల్లు

సర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లిలో ఒర్కల రాజవ్వ ఇంటి స్లాబ్ పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు స్లాబు పెచ్చులూడి ఇనుప చువ్వలు తేలాయి. ఆ సమయంలో ఎవరూ లేక పోవడంతో ముప్పు తప్పింది. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంటోంది.

కేజీవీల్స్ నడిపితే చర్యలు

లక్ష్మణచాంద: రబ్బరు తొడుగులు లేకుండా కేజీవీల్స్‌తో ట్రాక్టర్లను రోడ్లపై నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీకాంత్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని పార్‌పెల్లి పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. కేజీవీల్స్ ట్రాక్టరను రోడ్లపై నడిపితే సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితులు ఫోన్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పవద్దని సూచించారు. ఇందులో సర్పంచ్ రాజేందర్, రైతులు పాల్గొన్నారు.

నోట్‌బుక్‌లు పంపిణీ

ఖానాపూర్: మండలంలోని బీర్నంది జెడ్పీఎస్ఎస్‌లో వాసవిక్లబ్ క్లబ్ సభ్యులు విద్యా, ప్రకృతి సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు 200 నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఇటీవల ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన సాయిరాజ్ అనే విద్యార్థిని శాలువాతో సన్మానించారు. హెచ్ఎం సాయికృష్ణ, లక్ష్మణ్‌రావు, భూమేశ్, క్లబ్ సభ్యులు జితేందర్, కిషన్, లక్ష్మీనారాయణ, సతీశ్, మానస, స్రవంతి, వరలక్ష్మి, శ్వేత, శారద, తదితరులు ఉన్నారు.

నామినీ వివరాలు సేకరణ

లక్ష్మణచాంద: మండలంలోని వద్యాల్‌లో కొంఢ్ర నారాయణ అనే రైతు ఇటీవల మృతి చెందాడు. బుధవారం కన్కపూర్ క్లస్టర్ ఏఈవో రైతు ఇంటికి వెళ్లి నామినీ వివరాలు సేకరించారు. నామినీ ఆధార్, పట్టా పాస్‌పుస్తకం వివరాలు నమోదు చేసుకున్నారు.

వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించండి

సారంగపూర్: వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఇన్‌చార్జి కన్వీనర్ సయ్యద్ హైదర్ డిమాండ్ చేశారు. ఆయన మండలంలోని జామ్ గ్రామంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకులాన్ని సందర్శించి మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు గురుకులాలకు సన్నబియ్యం సరఫరా కావడం లేదన్నారు. మహ్మద్ హుస్సేన్, అలీఫ్‌ఖాన్, రవీందర్, మైఖేల్, సోఫియా, ఇమ్రాన్ ఉన్నారు.

ప్రమాదకర ప్రయాణం..

- వంతెనలు, కల్వర్టులకు రక్షణ గోడలు కరువు
- కిందపడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



లక్ష్మణచాంద సమీపంలో దెబ్బతిన్న రక్షణగోడ



ఈ చిత్రంలో రక్షణ గోడలు లేకుండా కన్పిస్తున్న ఈ లోలెవల్ వంతెన చామన్‌పెల్లి నుంచి మునిపెల్లి వెళ్లే మార్గంలో ఒర్రెపై నిర్మించారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే చామన్‌పెల్లి, చింతల్‌చాంద, తిర్పెల్లి తదితర గ్రామాల ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లపై వాగులు, ఒర్రెల వద్ద నిర్మించిన లోలెవల్ వంతెనలు, కల్వర్టులకు పలు చోట్ల రక్షణ గోడలు కరువయ్యాయి. దీంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి పలువురు వాహనదారులు కింద పడి ఆసుపత్రుల్లో చేరుతున్నారు. ప్రమాదాలు తగ్గించేందుకు అధికారులు స్పందించి వంతెనలు, కల్వర్టుల వద్ద రక్షణగోడలు నిర్మించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- లక్ష్మణచాంద నుంచి మల్లాపూర్ వెళ్లే మార్గంలో మలుపు వద్ద చెరువు నుంచి వెళ్లే కాలువపై చిన్న బ్రిడ్జి నిర్మించారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు మలుపు వద్ద రోడ్డు కోతకు గురై రక్షణ గోడ కూలింది.
- మండలంలోని మల్లాపూర్, మాచాపూర్, మునిపెల్లి గ్రామాల నుంచి ధర్మారం, పీచర, నిర్మల్ వెళ్తుంటారు. ధర్మారం గ్రామ సమీపంలో డీ–19 కాలువ వద్ద రక్షణ గోడ కూలిపోవడతోపాటు రోడ్డు కోతకు గురైంది. గతంలో మల్లాపూర్ నుంచి నిర్మల్ వెళ్తున్న కారు అదుపు తప్పడంతో కాలువలో పడ్డారు. వెంటనే స్థానికులు వారిని కాపాడటంతో ప్రాణాపాయం తప్పింది.



మల్లాపూర్ నుంచి మచాపూర్ వెళ్లే మార్గంలో..

గోడల్లేక ప్రమాదాలు



మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న వంతెనలపై రక్షణ గోడలు లేకపోవడంతో పలువురు కింద పడి ఆసుపత్రుల్లో చేరారు. అధికారులు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి. – రమేశ్, నర్సాపూర్

అధికారులు నిర్మించాలి



ప్రమాదకరంగా మారిన వంతెనల వద్ద అధికారులు రక్షణ గోడలు నిర్మించాలి. అత్యవసరమై రాత్రివేళ రాకపోకలు సాగించేవారు అదుపు తప్పి కింద పడే అవకాశం ఉంది. – ముత్యం, పీచర

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

మండలంలోని పలు గ్రామాల్లో రక్షణ గోడలు లేని వంతెనల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం. నిధులు మంజూరవగానే పనులు చేసి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం. తాత్కాలికంగా ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. – అంజనేశ్వర్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

మంత్రికి గ్రామస్తుల ఫిర్యాదు

మామడ: మండలంలోని నల్దుర్తి అటవీ ప్రాంతంలోని చెరువు పరిసరాల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మంత్రిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. సాగు చేస్తున్న పంటలకూ చెరువు నీటిని వదలడం లేదని వాపోయారు. రైతులు, పశువులను చెరువు వద్దకు అనుమతించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు శంకర్‌రెడ్డి, రాజన్న, మాజీ సర్పంచ్ గంగన్న, చంద్రశేఖర్, గణేశ్, రాజేందర్, నర్సయ్య ఉన్నారు.

మంత్రి ఆదేశాలతో పరిశీలన..



మంత్రికి ఫిర్యాదు చేస్తున్న నల్దుర్తి గ్రామస్తులు

స్పందించిన మంత్రి ఐకేరెడ్డి నల్దురిలో చెరువు సమస్యను పరిష్కరించాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో అటవీశాఖ కన్జర్వేటర్ శర్వానంద్, ఆదిలాబాద్ డీఎఫ్ఓ రాజశేఖర్ చెరువు పరిసరాలను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కార్మికగర్జన పోస్టర్ ఆవిష్కరణ

సారంగపూర్: హైదరాబాద్‌లో వచ్చే నెల 4న చేపట్టే కార్మిక గర్జనకు బీడీ కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి రాజన్న అన్నారు. మండల కేంద్రంలో బీడీ కార్మికలు, ఇతర పరిశ్రమల్లో పని చేసే కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఛలో హైదరాబాద్‌కు సంబంధించిన పోస్టర్ ఇవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికులకు జీవనభృతి, రూ.ఆరువేల పెన్షన్, ఈపీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు రామలక్ష్మణ్, లక్ష్మి, గంగామణి, శోభ, కమల, సోఫియా తదితరులు ఉన్నారు.

వద్యాల్‌లో..

లక్ష్మణచాంద: హైదరాబాద్‌లో నిర్వహించే కార్మిక గర్జనకు బీడీ కార్మికులు తరలిరావాలని ఐఎఫ్‌టీయూ జిల్లా స హాయ కార్యదర్శి గంగన్న అన్నారు. బుధవారం మండలంలోని వద్యాల్‌లో బీడీ కంపెనీ వద్ద కార్మిక గర్జనకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఇందులో ముత్తవ్వ, కవిత, ఆశన్న, లింగన్న, నారాయణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పీర్ల ఊరేగింపు



మొగ్లి గ్రామంలో పీరీలతో భక్తులు



కల్లూర్‌లో పీరీల ఊరేగింపు

తానూరు: ఈనెల 29న మొహరం నేపథ్యంలో మండలంలోని మొగ్లి గ్రామంలో బుధవారం భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మతాలకతీతంగా హిందువులు, ముస్లింలు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పుండలిక్, ఎంపీటీసీ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: ఈనెల 29న మొహర్రం పురస్కరించుకుని పట్టణంలో పీరీల ఊరేగింపు నిర్వహించారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే ఉత్సవాల్లో పెద్దఎత్తున పాల్గొన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీరాంనగర్ తకల పంజాను ఊరేగింపుగా తీసుకెళ్లారు. మాజీ ఎంపీపీ శోభారాణి పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో బుధవారం పీరీల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మలీద ముద్దలు సమర్పించి పలువురు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

దిలావర్‌పూర్: మండలంలోని గుండంపల్లిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్ముల చిన్న దేవేందర్‌రెడ్డికి ఇటీవల పితృవియోగం కలుగగా బాధిత కుటుంబాన్ని బుధవారం రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. వారి వెంట ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ రాంకిషన్‌రెడ్డి, నర్సాపూర్ జెడ్పీటీసీ చిన్న రామయ్య, నాయకులు గౌతమ్‌రెడ్డి, అనిల్, కృష్ణ, చిన్నారెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

మామడ: మండలంలోని పొన్కల్, కొరిటికల్ గ్రామాల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పర్యటించారు. ఇటీవల పొన్కల్‌లో చెందిన బెజ్జంకి శకుంతల, ఆశన్న, కొరిటికల్‌లో లస్మవ్వ మృతి చెందారు. బాధిత కుటుంబసభ్యులను మంత్రి పరామర్శించారు. వారి వెంట కిషన్‌రెడ్డి, లింగారెడ్డి, గంగారెడ్డి, నవీన్‌రావ్, భూమేశ్వర్ పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని ఆలూరుతో సోమ గంగయ్య మృతి చెందగా బుధవారం బాధిత కుటుంబసభ్యులను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. ప్రభుత్వం తరఫున సాయం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. వారి వెంట బీఆర్ఎస్ మండల కన్వీనర్ మాధవరావు, నాయకులు అల్లోల మురళీధర్‌రెడ్డి, పతాని భూమేశ్, చందు, బుచ్చన్న, మల్లయ్య తదితరులు ఉన్నారు.

నేటి నుంచి వార్షికోత్సవం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ముత్యాల పోచమ్మ ఆలయ వార్షికోత్సవం గురు, శుక్రవారాల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. మొదటిరోజు బోనాల పండుగ, అమ్మవారికి పంచామృతాభిషేకం, ఒగ్గు కథ ఉంటుందన్నారు. శుక్రవారం యాటల మొక్కు, అమ్మవారి పండుగ, జాతర పూజాకార్యక్రమాలు అర్చకులు నిమ్మగడ్డ శరత్‌చంద్రశర్మ ఆధ్వర్యంలో సాగుతాయని పేర్కొన్నారు.

కంపు కొడుతున్న మార్కెట్



జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఉన్న కూరగాయల మార్కెట్ కంపు కొడుతోంది. ఓ వైపు విక్రయదారులు కుళ్లిన కూరగాయలు, పండ్లను అక్కడే పారేస్తుండగా వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయాయి. మరోవైపు నాలాలో పూడిక తీయకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. అసలే వర్షాకాలం రోగాల బారిన పడే అవకాశం ఉందని కొనుగోలుదారులు కొనేందుకు జంకుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్





ఊరూరా ఇంకుడుగుంతలు నిర్మించాలి

ఖానాపూర్: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో గురువారం ఇంకుడు గుంతలు నిర్మించే కార్యక్రమం చేపట్టాలని ఎంపీడీవో మల్లేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 24 గ్రామపంచాయతీల పరిధిలో వాననీటి సంరక్షణలో భాగంగా 360 ఇంకుడుగుంతలు నిర్మించాలన్నారు. నివాసాలకు దిగువభాగంలో ఇంకుడుగుంతలు నిర్మించాలని సూచించారు.

కుంటాల: కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆలయాల ఆవరణలో ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం, ఏపీఓ గట్టుపల్లి నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ, ఉపాధి, ఐకేపీ సిబ్బందితోపాటు ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

అటెన్షన్ ప్లీజ్..

కొత్త స్తంభం ఏర్పాటు చేయరూ



లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామంలో మహాలక్ష్మీ ఆలయం ఎదుట ఉన్న విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరింది. దీంతో స్తంభం ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు పాత స్తంభం తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: శివకుమార్, విద్యుత్ ఏఈ, ఫోన్: 94408 11710

స్పందించారు.. పరిష్కరించారు

- వడ్‌ఝురి(బి)లో పాఠశాలలో తీరిన నీటి సమస్య

సాక్షి ఎఫెక్ట్..

తానూరు: మండలంలోని వడ్‌ఝురి(బి) గ్రామ ప్రాథమిక పాఠశాలలో నీటి వసతి లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 26న సాక్షిలో పాఠశాలలో నీటి కష్టాలు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు బుధవారం పాఠశాల ఆవరణలో ఉన్న బోరు మోటారుకు మరమ్మతులు చేపట్టి నీటి సమస్య పరిష్కరించారు. దీంతో విద్యార్థులు, మధ్యాహ్న భోజన కార్మికులకు నీటి కష్టాలు తప్పాయి.



మోటారుకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

ఈత మొక్కలను సంరక్షించుకోవాలి

కుంటాల: నాటిన ఈత మొక్కలను గీత కార్మికులు సంరక్షించుకోవాలని నిర్మల్ ఎక్సైజ్ సీఐ సంపత్‌కృష్ణ అన్నారు. హరితహారంలో భాగంగా బుధవారం మండలంలోని కల్లూర్, అందాకూర్, ఓలా, కుంటాల గ్రామాల్లో గీత కార్మికులతో కలిసి చెరువుగట్లపై ఈత మొక్కలు నాటారు. జిల్లాలో ఈఏడాది 60 వేల మొక్కలు నాటడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది రషీద్ ఖాన్, నరేందర్, పలువురు గీత కార్మికులు బండి రమణాగౌడ్, నర్సాగౌడ్, శరత్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సోమేశ్వర్‌గౌడ్, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఓలాలో మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ అధికారులు

ఈవీఎంల వినియోగంపై అవగాహన

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి, ధర్మోర, వట్టోలి గ్రామాల్లో బుధవారం ఈవీఎంల వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటుహక్కు ప్రాధాన్యం, నమోదు వంటి అంశాలను డిప్యూటీ తహసీల్దార్ షబ్బీర్ వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, సిబ్బంది బాల కిషన్, నరేశ్, సౌమ్య, నాయకులు భాస్కర్, అజోబ పటేల్, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

భైంసారూరల్: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఐ జయరావు అన్నారు. బుధవారం మండలంలోని కుంసర గ్రామంలో ఈవీఎం, వీవీప్యాట్‌ల ద్వారా ఓటువేసే విధానం వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, ఓటర్లు ఉన్నారు.



ధర్మోరలో అవగాహన కల్పిస్తున్న షబ్బీర్

పరిశుభ్రతపై దృష్టి సారించండి

తానూరు: గ్రామాల్లో పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో వర్షాలు కురుస్తున్నందున.. వర్షపు నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోజు పంచాయతీ ట్రాక్టర్ ద్వారా చెత్తను తరలించడంతోపాటు ఇంకుడు గుంతలు నిర్మించేలా చూడాలని సూచించారు. మొక్కలు నాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మోహన్‌సింగ్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్ తదితరులు ఉన్నారు.

కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి

సోన్: వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చేలా కార్యకర్తలు కష్టపడి పని చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గంజాల్ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ మండలాధ్యక్షుడు మ్యాక ప్రేమ్‌కుమార్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, సర్పంచ్‌లు నవీన్, మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీ రాజేశ్వర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సామ రాజేశ్వర్‌రెడ్డి

మైనార్టీ మోర్చా మండల కన్వీనర్‌గా తబ్రేజ్

మామడ: బీజేపీ మైనార్టీ మోర్చా మండల కన్వీనర్‌గా షేక్ తబ్రేజ్ నియమితులయ్యారు. బుధవారం మండలకేంద్రంలో జరిగిన బీజేపీ నాయకుల సమావేశం నిర్వహించారు. పార్టీ గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి ముత్యంరెడ్డి అన్నారు. అంజుకుమార్‌రెడ్డి, ఏలేటి లింగారెడ్డి, సంతోశ్, రాజారెడ్డి, మామడ ఎంపీటీసీ నవీన్, రంజిత్, సురేందర్, లింగంయాదవ్ పాల్గొన్నారు.

'అపరిచితులకు వివరాలు చెప్పొద్దు'

ఖానాపూర్: అపరిచితులు ఫోన్ చేసి బ్యాంకు, ఓటీపీ వివరాలు అడిగితే చెప్పవద్దని ఎస్సై ఆర్.శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని సుభాశ్‌నగర్, మండలంలోని తర్లపాడ్ గ్రామాల్లో ప్రజలకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై సూచించారు. ఏఎస్సై రాంచందర్, సిబ్బంది ఉన్నారు.



సుభాశ్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎస్సై శంకర్